# సూపర్‌మాన్

1970లలో మెడ్రాస్ వెళ్ళినప్పుడు మొదటిసారిగా సూపర్‌మాన్ సినిమా చూశాను. అంతకుముందు ఎన్నో కార్టూన్ పుస్తకాల్లో అవన్నీ ఇష్టంగా చదివేవాడిని. సూపర్‌మాన్ చక్కగా గాల్లో ఎగురుతాడు. తనొక్కడే కాకుండా తన ప్రేయసిని కూడా ఎత్తుకుని మరీ ఎగరగలడు. ఒక దేశం మీద ఇంకొక దేశం న్యూక్లియర్ బాంబు వేస్తే, గాల్లోకి ఎగిరి దాన్ని పట్టుకుని సముద్రంలో ముంచేయగలడు. భూకంపం వచ్చి భూమి చిట్లిపోయి బిల్డింగులు కూలిపోతుంటే ఎంతో మంది జనాలని రక్షించగలడు. అలాటివి ఇంకా ఎన్నో చేయగలడు. అందుకే అతను మనుష్యులని మించిన మనిషి అంటే సూపర్‌మాన్.

మరి మామూలు మనిషి సూపర్‌మాన్‌గా ఎప్పుడవుతాడు? అసలు అవుతాడా? అనేవి పిచ్చి ప్రశ్నలు కాదు కానీ, నిజంగా అందరూ అడగవలసిన ప్రశ్నలు.

మనిషి అతీతశక్తుల గురించి ఇంకో వ్యాసం వ్రాయటానికి కావలసిన సమాచారం సేకరిస్తున్నాను. త్వరలో మంచి వివరణతో వ్రాస్తాను. అదీకాక ఈ వ్యాసం వ్రాస్తున్న ఉద్దేశ్యం వేరు. అందుకని ఇంకో దారిన వెడదాం.

మనం చేయలేని పనులు ఊహించుకోవటం మానవ సహజం. ఇలలో జరగనివి కలలుగనటం, సినిమాల్లో చూడటం కూడా మామూలే. కాకపోతే వాటిని చూసి ఆనందించేసి, ఊహాపరంగా ఊహల్లోనే వుంచుకుంటే బాగుంటుంది. ఎందుకంటే అవి నిజజీవితంలో జరగకపోగా, అవి నిజమేననుకుని నమ్మేవారిని తప్పు దారి పట్టించే అవకాశం కూడా వుంది. అందుకని మన కళ్ళ ముందు కనపడే నిజమైన మనుష్యులలో ఎలాటి సూపర్‌మాన్‌లు వున్నారో చూడటం మంచిది. వారిలో మామూలు కన్నా ఎక్కువగా మంచి లక్షణాలు వుంటే చూడటం, అలాటివారి సరసన జేరి వారి మంచి పనులలో పాలుపంచుకోవటం మనుష్యులుగా మన బాధ్యత. అలాటి మంచి మనుష్యులు మన ఎదురుగా చాలమంది వున్నారు. కాకపోతే మనం వారిని గుర్తించటం, గౌరవించటం నేర్చుకోవాలి. అంతే.

0 0 0

క్రిస్టఫర్ రీవ్ పేరు మీరందరూ వినే వుంటారు. సూపర్‌మాన్ సినిమాల్లో రెండున్నర దశాబ్దాలు మనల్నందరినీ ఆకాశంలో తిప్పేశాడు. క్లార్క్ సామాన్యుడే ఎవరికైనా కష్టాలు వస్తే సూపర్‌మాన్ అయిపోతాడు. అన్ని సూపర్‌మాన్ సినిమా ల్లోనూ అదే కథ. కథ అదే అయినా, మరి కష్టాల్లో వుండేవాళ్ళూ ఎక్కువే కనుక అన్ని సినిమాలు తీయవలసి వచ్చింది. కానీ అతను నిజజీవితంలోనూ సూపర్‌మానే.

0 0 0

సూపర్‌మాన్ సినిమాల్లోనూ ఇతర సినిమాల్లోనూ ఎంతో పేరు గడించుకున్న క్రిస్టఫర్ రీవ్, డానా మొరోసిని అనే అమ్మాయిని పెళ్ళిచేసుకున్నాడు. ఆమె కూడా చక్కటి నటి. గాయకురాలు. వాళ్ళిద్దరి అన్యోన్యానికి చిహ్నంగా విల్ అనే ఒక కొడుకు. వాళ్ళ జీవితం సుఖసంతోషాలతో అలా గుర్రాల మీద పరుగెడుతున్న రోజుల్లో, 1995లో క్రిస్టఫర్ గుర్రపు స్వారి చేస్తూ క్రింద పడ్డాడు. అతని వెన్నెముక పూర్తిగా చెక్కలూ ముక్కలూ అయింది. పక్షవాతం పాలయాడు. అందరూ అతను చనిపోతాడనే అనుకున్న సమయంలో, అతను మృత్యువుతో పోరాడాడు. ఎంతో క్లిష్టమైన కొన్ని ఆపరేషన్లు వరుసగా చేయించుకున్నాడు. థెరపీలు చేశాడు. శరీరంలో లేని శక్తి మానసికంగా తెచ్చుకున్నాడు. అతని పక్కనే అండగా నిలబడింది డానా.

ఎవరూ అనుకోని విధంగా అతను మృత్యువునే కబళించి, మళ్ళీ మనుష్యుల్లోకి వచ్చాడు. చక్రాల కుర్చీలో కూర్చున్నా, గొంతులో నించి రాని మాట కంఠంలో అమర్చిన ఒక ట్యూబ్‌లో నించీ వస్తున్నా, అతను అంతకు ముందు కన్నా కూడా ఇంకా బిజీ అయిపోయాడు. ఈసారి తెర మీద కాకుండా నిజజీవితంలో సూపర్‌మాన్ అయాడు.

0 0 0

వెన్నెముక విరిగిన సందర్భంలో చేయవలసిన చికిత్సలో జరగవలసినంత రీసెర్చి ఇంకా జరగలేదనీ, అలా వెన్నెముక విరిగిన వారికి కావలసిన ఆర్థిక సహాయం చేసే స్వచ్ఛంద సంస్థలకు అవసరమైన వనరులు లేవనీ గుర్తించాడు. అందుకే క్రిస్టఫర్ రీవ్ పెరాలిసిస్ ఫౌండేషన్ని స్థాపించాడు. తన ఆస్తిలో చాల భాగం ఇవ్వటమే కాక, కొన్ని మిలియన్ల డాలర్లు చందాలుగా పోగుచేశాడు. అతని మాటల్లో 'ఏదీ అసాధ్యం కాదు'. ఆ మాట ప్రకారమే ఎన్నో అసాధ్యాలని సాధించాడు.

నిస్సహాయులైన వికలాంగులకి ధైర్యం చెప్పే సహాయ సంఘాలు (Support Groups) ప్రారంభించాడు. వాళ్ళు ఒంటరిగా లేరనీ, కావలసిన సహాయం అందుతుందనీ మనోధైర్యం ఇచ్చే కౌన్సలింగ్ కార్యక్రమాలు మొదలుపెట్టాడు. రకరకాల మీటింగుల్లోనూ, సెమినార్లలోనూ ఇటు వికలాంగునే కాక, అటు రీసెర్చి గ్రూపులనీ ఉత్తేజపరిచాడు. ప్రభుత్వంలో తన పరపతి ఉపయోగించి ఎన్నో రకాల గ్రాంటులనీ, ఇతర సహాయాల్నీ సాధించగలిగాడు. క్రిస్టఫర్ రీవ్ పెరాలిసిస్ యాక్ట్ పాస్ చేసింది గవర్నమెంట్. గవర్నమెంట్ వెంటపడి సాధించిన సొమాటిక్ సెల్ న్యూక్లియర్ ట్రాన్స్‌ఫర్, స్టెమ్ సెల్ రీసెర్చి ఎన్హాన్స్‌మెంట్ యాక్ట్ ఇతని కష్టానికి ఫలితాలే.

ఈ విషయాల్లో శాస్త్రీయ పరిశోధన కోసం ఇతని ఫౌండేషన్ 53 మిలియన్ల డాలర్లు ఇచ్చింది. వికలాంగులకి మామూలు జీవితం కాకపోయినా, వారి పరిస్థితి మెరుగు పరిచే పరికరాల నిమిత్తం 6.5 మిలియన్ల డాలర్లు ఇచ్చింది. ఇవన్నీ ఒక్క పక్షవాతం వచ్చినవారికే కాదు. హృద్రోగం, ఎ ఎల్ ఎస్, మల్టిపుల్ స్లెరోసిస్, సెరెబ్రల్ పాల్సీ మొదలైనవి వచ్చి, మంచం పాలైన వారికీ అందింది ఈ సహాయం.

తొమ్మిదిన్నర సంవత్సరాల్లో మామూలు మనుష్యులు చేయలేని ఎన్నో పనులు వైద్యరంగంలో చేసి ఎంతోమంది వికలాంగుల జీవితాల్లో దీపాలు వెలిగించిన

క్రిస్టఫర్ రీవ్, 2004వ సంవత్సరం అక్టోబర్‌లో సూపర్‌మాన్‌లాగా ఆకాశంలోకి ఎగిరిపోయాడు. కాకపోతే నిజజీవితంలోని తన హీరోయిన్ డానాని, సినిమాల్లోలా తనతో తీసుకుపోకుండా భూమి మీదే వదిలేసి వెళ్ళిపోయాడు. ఎందుకు?

'క్రిస్ బ్రతికివున్నప్పుడు మొదట్లో మేమంతా మా కుటుంబానికే అంకితమైపోయాము. అతనికి ప్రమాదమయి తన జీవితమేకాక, తనలాటి వారి అందరి జీవితాలూ బాగుపడాలని ప్రతి నిమిషం శ్రమ పడుతున్నప్పుడు, మా జీవితం వెండితెర మీద కెక్కింది. ప్రతి పేపరూ, టీవీ అతని బాధని జనం ముందు వుంచారు. అతని పక్కనే నిలబడి నేనూ ఆ పనిలో పాలుపంచుకున్నాను. అతను పోయినా నాకు వేరే ఇంకొక జీవితం వుందని నేను అనుకోవటల్లేదు. అందుకే అతని మరణం ద్వారా ఆగిన ఈ కార్యక్రమాన్ని నేను కొనసాగిస్తాను. అదే అతనికి నేను ఇవ్వగలిగిన నివాళి' అంది డానా.

అందుకనే అనుకుంటాను ఈ సూపర్‌మాన్ ఆమెని ఇక్కడ వదిలేసి తను ఎగిరి వెళ్ళిపోయింది.

డానా క్రిస్‌ని పెళ్ళి చేసుకున్న మూడేళ్ళకే, అతనికి ఈ ప్రమాదం జరిగింది. అప్పటికే వాళ్ళకి విల్ పుట్టాడు. గాయకిగా, బ్రాడ్‌వే నటిగా తన ఉత్సాహాన్ని, అభిలాషనీ పక్కన పెట్టి అతనికి మనసా వాచా అండగా నిలిచింది డానా. 'మా అమ్మంటే నాకు ప్రాణం. ఆవిడకీ నేనంటే అంతే. ఆవిడే నాకు ఎప్పుడూ తోడుగా వుండేది. క్రిస్‌కి ప్రమాదం అయాక అమ్మా నాన్నా మా ఇంటికి దగ్గరగా ఒక ఇల్లు అద్దెకి తీసుకుని మాకు ఎంతో సహాయం చేశారు. మా అమ్మ నాకు ఎంతో ధైర్యం చెప్పేది. క్రిస్ చనిపోయిన నాలుగు నెలలకే మా అమ్మా చనిపోయింది. నాకిక విల్ ఒక్కడే మిగిలాడనుకున్నాను. కానీ క్రిస్ ద్వారా ఎంతో మంది వికలాంగులు సహాయంకోసం ఎదురు చూస్తున్నారు. వాళ్ళందరూ నా వాళ్ళే. అందుకే మా క్రిస్టఫర్ రీవ్ పెరాలిసిస్ ఫౌండేషన్‌కి నేను ఛైర్మన్ అయి, అతను మొదలు పెట్టిన పని కొనసాగిస్తున్నాను' అంది డానా.

క్రిస్‌కి అండగా నిలిచి ఇలా సేవ చేస్తున్నందుకు మీరు సూపర్ వుమన్ అని పత్రిక విలేఖరులు అంటే 'అదేమీ కాదు. అతనే నాకు అండగా నిలిచాడు. అతని మీదే నేను చివరిదాకా ఆధారపడ్డాను. అంతెందుకు, ఈమధ్య నేనూ విల్ ఎక్కడికో వెళ్ళాం. అక్కడికి వెళ్ళగానే నాన్నని పిలుస్తానుండు అని ఫోన్ తీసుకోబోయాను. అప్పుడు కానీ గుర్తు రాలేదు. క్రిస్ మాతో లేడని' అంది మామూలు మనిషి డానా!

0 0 0

(ఈవ్యాసం 2005లో వ్రాశాను. 2006 మార్చిలో లంగ్ కాన్సర్‌తో బాధ పడుతున్న డానా సూపర్‌మాన్‌ని కలుసుకోవటానికి ఆకాశంలోకి అలా అలా.... ఎగిరి వెళ్ళి పోయింది. కానీ వాళ్ళిద్దరూ ప్రారంభించిన ఫౌండేషన్ తమ కార్యక్రమాలని ఇంకా నిర్వహిస్తూనే వుంది.)